క్లుప్తంగా

సుగర్ పేషెంట్‌కు సాయం



సాయం అందజేస్తున్న ఫ్రెండ్స్ ఫర్ సర్వీస్ గ్రూపు సభ్యులు

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామానికి చెందిన మల్లవరపు దయామణికి సుగర్ కారణంగా కాళ్లు తొలగించారు. ఆమె నివసించేందుకు ఇల్లు లేక చర్చిలో ఉంటున్నారు. ఆమెకు కృత్రిమ కాలుకు రాజోలు నియోజకవర్గం ఫ్రెండ్స్ ఫర్ సర్వీస్ ప్రతినిధులు మంగళవారం రూ.14,100 సహాయం అందించారు. మన రక్షకుని సహవాసం గ్రూప్ సభ్యులు రూ.ఆరు వేలు వెరసి రూ.20,100 సాయం చేశారు. కార్యక్రమంలో జాలెం రమేష్, చామంతి పండు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం



కొత్తపేట సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సురేంద్ర

కొత్తపేట: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం అందరి లక్ష్యం కావాలని, స్థానిక ఎస్సై జి.సురేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి యాప్, మాదక ద్రవ్యాల నిరోధకం, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్సై సురేంద్ర మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలన్నారు. తల్లిదండ్రులు-అధ్యాపకులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. మీ పరిసరాల్లో గంజాయి, మాదక ద్రవ్యాలను ఎవరైనా వినియోగించినా లేదా విక్రయించినా, ఆ సమాచారాన్ని దగ్గరలోని పోలీస్ వారికి గాని, 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకువచ్చిన శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని అన్నారు. ఇది మహిళలకు కష్ట సమయంలో శక్తిగా ఉపయోగపడుతుందని తెలిపారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

పి.గన్నవరం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు సూచించారు. మంగళవారం నాగుల్లంక సొసైటీ కార్యాలయం వద్ద జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లాలో 1,63,399 ఎకరాలకు గాను, ఇంతవరకు 45,077 ఎకరాల్లో రైతులు వరినాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. జిల్లాకు 80% రాయితీపై 40 వ్యవసాయ డ్రోన్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 23 డ్రోన్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఒక్కో గ్రూపునకు 80% రాయితీతో ఈ డ్రోన్లను మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జిల్లాలో 26 వేల టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు బోసుబాబు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్, సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, సొసైటీ కార్యదర్శి సురేష్, రైతులు పాలూరి ఫణి, యల్లమెల్లి చిట్టిబాబు, ఏఈఓలు సూర్యతేజ, దుర్గారావు, వీపీఏలే నవీన్, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పాఠశాలలు

- ఓ వైపు అసంపూర్తి, మరోవైపు శిథిల భవనాలు
- లోతట్టు ఆట స్థలాలు, ప్రహరీలూ లేవు
- వంట షెడ్‌లు, భోజనశాలలూ నిల్



గూడపల్లిలో శిథిలమైన కొప్పిడి వారి మెరక పాఠశాల భవనం



పెచ్చులూడుతున్న కొప్పిడి వారి మెరక పాఠశాల భవనం శ్లాబ్

మలికిపురం: ప్రభుత్వ పాఠశాలలు పలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదయినా పాఠశాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన, మెరుగు పరచడంలో ఇంకా శ్రద్ధ వహించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన నాడు-నేడు పనులను అర్థాంతరంగా కూటమి సర్కారు నిలిపి వేసింది. ఫలితంగా ఆయా పాఠశాలల్లో అరకొర పనుల వల్ల అక్కడ బోధన కూడా సరిగా ఉండడం లేదు. అరకొర పనుల వల్ల ఆ భవనాలు నిరుపయోగంగా ఉండడంతో ఇరుకు గదులతోనే కాలక్షేపం చేస్తున్నారు. అలాగే పలు చోట్ల శిథిల భవనాలలో కూడా పాఠశాలలు నడుస్తున్నాయి. మరి కొన్ని గ్రామాల్లో శిథిల భవనాల తొలగింపునకు వేలం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాటి జోలికి వెళ్లడం లేదు. మొత్తం రాజోలు నియోజకవర్గంలో సుమారు 240 ప్రాథమిక, 27 ఉన్నత పాఠశాలలకుగాను మూడోవంతు పాఠశాలల్లో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. పలు చోట్ల శిథిల ప్రహరీలు, మరుగుదొడ్లు, శిథిల భవనాల వల్ల విద్యార్థులు ఆటల కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో ఇలా శిథిల మరుగుదొడ్డి కూలి విద్యార్థి గాయపడిన సంగతి పాఠశాలకు విదితమే. గూడపల్లి కొప్పిడివారి మెరక పాఠశాలలో ఒక శిథిల భవనం వల్ల అక్కడ ప్రమాద ఘంటికలు నెలకొన్నాయి. ఇక నియోజకవర్గంలో ప్రతి ప్రాథమిక పాఠశాల కూడా ప్రహరీ నిర్మాణానికి నోచలేదు. అక్కడ లోతట్టు ప్రాంతం వల్ల కూడా విద్యార్థులకు కనీసం ఆటస్థలం కూడా లేదు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది కదా ఇక ఆట స్థలాలు అవసరమే అనే తరహాలో కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు అంటున్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో పాఠశాలల ఆట స్థలాలు చేర్చాలని కూడా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాల్లోచేర్చారు. కానీ ఆ శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అదే జరిగిన ఉంటే గడచిన వేసవిలో మెరక పనులు జరిగి ఉండేవే. ఉపాధి శాఖ అధికారుల తీరుపై ఇప్పటికే రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సైతం తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. అలాగే పాఠశాలల వద్ద మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా ఉండడం లేదని అంటున్నారు. అక్కడ పని చేసే శానిటరీ వర్కర్లకు ప్రభుత్వం జీతాలు సక్రమంగా ఇవ్వక పోవడం వల్ల ఈ స్థితి నెలకొందని అంటున్నారు. ఇక పాఠశాలల వద్ద మిడ్డే మీల్స్ పథకానికి షెడ్‌లు లేక పాఠశాల పంచనే వంటలు చేస్తున్న పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. నియోజకవర్గంలో దాదాపు 50 శాతం పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం వంట షెడ్‌లు లేవు. దీంతో పొగబారిన పడడం విద్యార్థుల వంతు అవుతుంది. భోజనాలు చేసేందుకు కూడా భోజనశాలలు లేవు.

కొత్త భవనం నిర్మించాలి



గ్రామంలోని కొప్పిడి వారి మెరక ఉన్నత పాఠశాల భవనం శిథిలమైంది. ఇది నిర్మాణం జరిగిన 40 ఏళ్ళు పూర్తి కావడం వల్ల శ్లాబ్ శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యార్థులు భయ పడుతున్నారు. కొత్త భవనం నిర్మాణం చేయాలి.

– సుందర బ్రహ్మయ్య, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, గూడపల్లి

కొన్ని భవనాలు తొలగించాల్సి ఉంది



పాఠశాలల భవనాలు శిథిలమైన వాటిని గుర్తించి ఎంపీడీఓలకు తెలియజేశాం. ఆ అధికారులు వాటిని తొలగించేందుకు ఆక్షన్‌లు పెట్టారు. వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని ప్రతిపాదించాం. ఆట స్థలాల మెరక కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– ఎం.విజయశ్రీ, ఎంఈఓ, మలికిపురం

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



పాఠశాలల ఆట స్థలాలు మెరక చేసుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి. గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, ఉపాధి విభాగం అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయండి. ఉపాధి విభాగంలో అభివృద్ధి పనులకు అవకాశాలు అధికంగా ఉన్నాయి.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

జగన్‌ను కలసిన 'మందపాటి' దంపతులు



పి.గన్నవరం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని పి.గన్నవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మందపాటి కిరణ్‌కుమార్, అనితా శుభజ్యోతి దంపతులు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి పాలెం సెంటర్లో మంగళవారం మామిడికుదురు గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం చేశారు. ఈ మేరకు త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన భగవద్గీత గ్రంథ పుస్తకాలను వేదిక అధ్యక్షుడు బండారు సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానికులకు అందజేశారు. భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కుల మతాల అసమానతలను తొలగించబడతాయని సత్యనారాయణ తెలిపారు. హనుమంతురావు, బ్రహ్మాజీ, సుబ్బారావు, శేషు, వెంకటేష్, అన్నపూర్ణ, జాహ్నవి, సత్యవతి, ధర్మతేజ, జగదీష్ పాల్గొన్నారు.

బాబు మోసాన్ని గుర్తిస్తున్న ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన పథకాల ష్యూరిటీల అమలు చేయకపోవడంతో ప్రజలు మోసాన్ని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పెన్మత్స చిట్టిరాజు అన్నారు. మంగళవారం అయినవిల్లి మండలం తొత్తరమూడిలోని వీవర్స్ కమ్యూనిటీ భవనంలో అయినవిల్లి మండల శాఖ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతనన జరిగిన జరిగిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో వీరు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పెన్మెత్స చిట్టిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల కుట్రలు చేసి ప్రజలను మోసగించేందుకు బాబు ష్యూరిటీలను తెర పైకి తెచ్చారన్నారు. ఎన్నికల అనంతరం కూటమి తాము ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడం కష్టమవుతోంది. రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి ఉందని ఈ పథకాలు అమలు చేయడం మా వల్ల కాదని నోరు వెళ్లబెట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ప్రజల నోళ్లను మూయించడానికి తల్లికి వందనం వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. తల్లికి వందనం పథకంలో చాలా మంది తల్లులకు అనేక షాకులను చూపి తల్లికి వందనం వర్తింపచేయలేదని ఆరోపించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేక పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు ఆసరాగా నిలిచారన్నారు. అలాగే పార్టీ కార్యకర్తలకు, నాయకులకు భీమా వర్తింపజేసేందుకు, వారికి అండగా ఉండేందుకు అన్ని ప్రయత్నాలను జగన్ చేస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తల రక్షణ కోసం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తాము జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నాయకులు చేట్ల రామారావు, మిండగుదిటి రాంబాబు, వాసంశెట్టి తాతాజీ, మిండగుదిటి శిరీష్ నారాయణ, కాశి వీవీ సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

కొత్తపేట: సాగుకు రాయితీ ప్రోత్సాహం, అధిక ఆదాయం లభించే ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి (డీహెచ్‌ఓ) బీవీ రమణ రైతులకు సూచించారు. మండలంలోని వానపల్లిలో సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, జిల్లా ఉద్యానశాఖ సంయుక్తంగా ఆయిల్‌పామ్ మెగా మేళా నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లాలో ఎటువంటి పరిశ్రమలు, ఇతర ఆదాయాలు ఏమీ లేవన్నారు. సంప్రదాయంగా పండించే వరి, అరటి వంటి పంటలకు ఆదాయం తగ్గిపోవడమే కాకుండా తరచూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎక్కువగా డిమాండ్ కలిగి, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోని, తక్కువ కూలీలతో సాగు చేసుకోగలిగిన పంట ఆయిల్‌పామ్ అని అన్నారు. పామాయిల్ పంటను వేసుకొని అంతరపంటలతో కలసి ఎకరానికి రూ.2 లక్షలు ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం గతంలో పామాయిల్ తోట వేసి మంచి ఫలితాలు పొందుతున్న అభ్యుదయ రైతులు సాకా కాంతాభవాని, అయ్యల సోమయాజుల విశ్వనాథ్‌లను ఘనంగా సత్కరించారు. కొత్తగా తోటలు వేయనున్న పలువురు రైతులకు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం కేజే ప్రభాకర రావు, సర్పంచ్ పల్లి భీమారావు, స్థానిక డీహెచ్‌ఓ జి.కోటేశ్వర రావు, సర్వే సాయి ఏజీఎం పి.వీరభద్రరావు, మేనేజర్ బీవీ కృష్ణంరాజు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పార్టీ నేతలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించం



మామిడికుదురులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కిశోర్

మామిడికుదురు: మోసపూరిత హామీలతో ప్రజల్ని మభ్యపెడుతున్న సీఎం చంద్రబాబు వైఖరిపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి శ్రేణులు దాడులకు పాల్పడడం గర్హనీయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ తీవ్రంగా ఖండించారు. మామిడికుదురులో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలకు హాజరవుతున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులపై కూటమి మూకలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. వీటికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం, చిత్తూరు జిల్లాల పర్యటనల్లో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, రైతులపై కూటమి మూకదాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం, అతనిపైనే క్రిమినల్ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. కృష్ణా జిల్లాకు చెందిన బీసీ మహిళ జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై నిర్దాక్షిణ్యంగా దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉచ్చుల మోహన్, ఉప్పాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో రఘురామ్

కొత్తపేట: బీజేపీ నాయకుడు పి.రఘురామ్ మంగళవారం వాడపల్లి వేంకటేశ్వరుని దర్శించుకున్నారు.. ఆయన స్వామి దర్శనానికి రాగా జిల్లా, స్థానిక బీజేపీ నాయకులు స్వాగతం పలికి ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ అర్చకులు, వేదమంత్రాలతో రఘురామ్‌కు వేదాశీర్వచనం అందించారు.

భూమి కౌలు, సరకుల సరఫరాకు వేలం పాట

కొత్తపేట: మందపల్లిలో ఉన్న ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామి వారి దేవస్థానానికి సంబంధించి వివిధ వేలం పాటలను మంగళవారం నిర్వహించారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో పలివెల ఉమా కొప్పేశ్వరస్వామివారి దేవస్థానం ఈఓ వీవీఎస్ కామేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో పాటలు, టెండర్లు నిర్వహించారు. ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జూలై 15 వరకూ సంవత్సర కాలానికి కొబ్బరికాయలు, నల్ల నువ్వులనూనె, కిరాణా, పూజా సామగ్రి సెట్లు, నెయ్యి, పెరుగు, ఫ్లవర్ డెకరేషన్, ప్రింటింగ్ సామగ్రి, టెంట్ హౌస్ సామగ్రి, ఎలెక్ట్రికల్ డెకరేషన్, సానిటేషన్ సామగ్రి, జపం, హోమసామగ్రి సెట్లు, సర్వే కర్రలు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, సర్వెంట్లు సప్లయ్ చేయుటకు టెండరు-కం-ఈ టెండర్లు నిర్వహించారు. వేణుగోపాలస్వామి వారి దేవస్థానానికి కొత్తపేట, రావులపాలెం మండలం ఊబలంక గ్రామాల్లోనిల 7.72 ఎకరాల మెరక భూమిని 2025-26 నుంచి 2027-28 వరకు మూడేళ్ల కాలపరిమితిలో కౌలుకు సాగు చేసుకొనుటకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. పై భూమికి గతంలో రూ.1.10 లక్షలు శిస్తు ఉండగా ఈ పాటల్లో రూ.2 లక్షలకు పాట వెళ్లగా రూ.90 వేలు ఆదాయం పెరిగిందని ఈఓ సురేష్‌బాబు తెలిపారు. మరో 1.04 ఎకరాల మెరక భూమి పాట, కూరగాయల టెండరు, దేవస్థానంలోని గానుగ మిల్లు నందు మరపట్టి భక్తులకు నల్ల నువ్వుల నూనెను అమ్ముకునే లైసెన్స్ హక్కునకు టెండరు-కం-బహిరంగ వేలం పాట వాయిదా పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సిద్ధంశెట్టి వీవీ సత్యనారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్, మందపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

అంబాజీపేట: స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్-2లో భాగంగా వక్కలంకలో కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. బృందం ప్రతినిధులు ఎం.ప్రశాంత్, కె.శ్రీనివాసరావు, పి.ప్రవీణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై తనిఖీ చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి 16 మందిని లబ్ధిదారులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని బృంద సభ్యులు తెలిపారు. వీరంతా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారా, ఎలా ఉన్నాయి. వాటికి అయిన ఖర్చు తదితర అంశాలపై పరిశీలన చేసి వివరాలను సేకరించారు. అలాగే దీంతో పాటు దేవాలయం, చర్చి, మసీదులో ఒకటి, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, హెల్త్ క్లినిక్ వద్ద ఉన్న పారిశుధ్యం, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న తడి, పొడి చెత్త సేకరణ, పారిశుధ్యం, అభివృద్ధి తదితర అంశాలపై వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఈ నివేదికను కేంద్రానికి అందిస్తామని బృంద సభ్యులు తెలిపారు. బృందం వెంట సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, ఎంఈఓ మోకా ప్రకాష్, కార్యదర్శి తాతాజీ ఉన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి, న్యాయవాదులు

కొత్తపేట: మధ్యవర్తిత్వంతో స్నేహపూర్వకంగా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా అవడంతో పాటు సమస్య సత్వరమే పరిష్కారం అవుతుందని స్థానిక న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. జిల్లా న్యాయాధికారి సంస్థ రాజమహేంద్రవరం వారి ఆదేశాల మేరకు మీడియేషన్ ఫర్ నేషన్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కమ్మిరెడ్డిపాలెం సెంటర్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు, అక్కడి నుంచి కోర్టు వరకు కాలినడకన ర్యాలీ నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న క్రిమినల్, సివిల్ కేసులను, మోటారు వాహనాల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి ఐదుగురు న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ కె.వెంకటరెడ్డి, ఏజీపీ జీవీ నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతల మోహన్‌రావు, సెక్రటరీ బండారు రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఏటీ ప్రభాకరరావు, అల్లు భాస్కరరావు, పీవీఆర్ దొర, టీఎంకే శర్మ, డి.బాలప్రతాప్, వై.ఆదినారాయణ, టీఎస్ సత్యమోహన్, జి.ప్రసాద్, వై.వెంకటేశ్వరరావు, ఎస్వీజీ రెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, పి.సత్యనారాయణ, అడిషనల్ ఎస్సై ఎ.వెంకటేశ్వరరావు, పోలీస్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

సొసైటీ రైతులకు ప్రత్యేక పథకాల కోసం వినతి

సఖినేటిపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీసీఎఫ్, ఎఫ్‌ఎల్‌సీ సొసైటీల రైతులకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా ప్రత్యేక పథకాల రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీ మాజీ మెంబర్, రాజోలు సమష్టి వ్యవసాయ సహకార సంఘాల ప్రధాన సలహాదారు నేలపూడి స్టాలిన్‌బాబు, సంఘాల గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌ను కలసి వారు ఒక వినతిపత్రం అందజేశారు. బ్రిటిష్, ఇందిరాగాంధీ ప్రభుత్వం మిగులు భూములను పేదలైన ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేశాయని, వీటిని సాగు చేసుకుంటున్న సదరు రైతులు ఇప్పటికీ పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. ఉప్పునీటి ప్రవాహం వల్ల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్న వారికి సముద్ర జలాలను నిలువరించే ఏర్పాటు చేయాలని కోరారు. పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకం ద్వారా సొసైటీల రైతులకు మేలు చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం అందించిందని, దీనిని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కాగా రైతుల భూములు సొసైటీల పేరున రిజిస్టర్ అయిఉన్నందున ప్రభుత్వ పథకాలు వర్తింపునకు వస్తున్న అడ్డంకులను తొలగించాలని కోరారు. ఇదిలా ఉండగా స్వీయ రచన చేసిన దామోదరం సంజీవయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని రాజశేఖర్‌కు, స్టాలిన్‌బాబు అందజేశారు.

ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం



పోటీల్లో గెలుపొందిన విజేతలు

మామిడికుదురు: ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు ఏర్పాటు చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు డ్రాయింగ్, రోల్ ప్లే, క్విజ్, చార్ట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. రిటైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో కూడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం బి.చిరంజీవి రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ వై.మధు, జె.మోనికా కృష్ణ, పి.సత్యశ్రీ, స్టాఫ్ సెక్రటరీ భూపతి మనోహర రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి పనుల పరిశీలన

ఆలమూరు: స్థానిక నాగుల చెరువు వద్ద ఉన్న గ్రంథాలయం పై అంతస్తు నిర్మాణ పనులను ఎంపీడీవో ఎ.రాజు మంగళవారం పరిశీలించారు. సుమారు రూ.12 లక్షలతో నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయ పాఠకులకు వసతుల కల్పనలో భాగంగా పై అంతస్తు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఈదల నల్లబాబు, లైబ్రేరియన్ టి.నమశ్శివాయ పాల్గొన్నారు.